
# ఏజెంట్ X

యెదుళ్ల సురేష్ రెడ్డి

ఎల్లీ బార్క్‌జాటీస్



పశ్చిమ జర్మనీ ఇంటలిజెన్స్ ఏజన్సీ హెడ్ క్వార్టర్స్...

తన గదిలో కూర్చుని సీరియస్‌గా పని చేసుకుంటున్న ఆ సంస్థ ప్రధానాధికారి జనరల్ రిచర్డ్ గెలెన్ స్ప్రింగ్ డోరు తెరుచుకున్న చప్పుడుకు తల ఎత్తి చూశాడు.

అప్పుడే లోపలికి వస్తున్నాడు ఆరడుగుల అజానుబాహుడైన కల్నల్ హెగ్రే. చిరునవ్వుతో గెలెన్‌ని విష్ చేసి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడతను.

చదువుతున్న ఫైలును ప్రక్కన పడేసి సూటిగా అతనివైపు చూశాడు గెలెన్. "తూర్పు జర్మనీలో మన స్పై నెట్‌వర్క్ ఎలా ఉంది?" అంటూ అడిగాడు నేరుగా విషయానికి వస్తూ.

"ప్రస్తుతానికి అంత బాగా లేదు" అన్నాడు హెగ్రే. "ఎస్.ఎస్.డి. (స్టేట్ సెక్యూరిటీ సర్వీస్- తూర్పు జర్మనీ గూఢచార సంస్థ) చీఫ్ ఉల్ఫ్‌బర్ చాలా సమర్థవంతంగా మన స్పై నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయగలిగాడు. ఇప్పటికే మన గూఢచారుల్లో చాలామంది వారికి పట్టుబడ్డారు. మనం వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుంటే తప్ప లాభం లేదు."

"నేనూ అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు గెలెన్. "తూర్పు జర్మనీలో మనం వెంటనే మరో స్పై నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలి. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేయాల్సిందిగా ఇప్పటికే మన ఇంటలిజెన్స్ అధికారులందర్నీ ఆదేశించాను. వీలయినంత త్వరలో ఇదంతా జరగాలి."

"ఇందులో నేను చేయాల్సిందేంటి..? ఇంతకీ నన్నెందుకు పిలిపించారు..?" అర్థం కానట్టుగా అడిగాడు హెగ్రే.

అతని మాటలకు చిన్నగా నవ్వాడు గెలెన్. "నిజానికి ఇందులో నువ్వు చేయాల్సిందేమీ లేదు. నిన్ను పిలిపించింది మరో పని కోసం." ఒక్క క్షణం ఆగి తిరిగి కొనసాగించాడతను." వుల్ఫ్‌బర్ దాదాపుగా తూర్పు జర్మనీలోని మన గూఢచారులందర్నీ అరెస్టు చేయించగలిగాడు. కానీ అతనికి ఏ మాత్రం అనుమానం రాకుండా మన ఏజంటు ఒకరు తూర్పు జర్మనీ ప్రధానమంత్రి కార్యాలయంలో చాలా చురుకుగా తన కార్యకలాపాల్ని నిర్వహిస్తోంది. నువ్వు ఆమెతో కాంటాక్ట్ ఏర్పరచుకుని ఎప్పటికప్పుడు ఆమె సేకరించిన సమాచారాన్నంతటినీ ఇక్కడికి చేరవేయాలి. అందుకోసమే నిన్నిక్కడికి పిలిపించాను."

"ఎవ రా ఏజంటు..?" ఆసక్తిగా అడిగాడు హెర్రే.

"తూర్పు జర్మనీ ప్రధానమంత్రి ఒట్టో గ్రోట్‌వాల్ పర్సనల్ సెక్రటరీ ఎల్లీ బార్క్‌జాటీస్."

భరించలేనంత విస్మయంతో అతనివైపు చూశాడు హెర్రే. "తూర్పు జర్మనీ ప్రధానమంత్రి పర్సనల్ సెక్రటరీ మన ఏజంటా..!?" అంటూ అడిగాడు విస్మయంగా.

అవునన్నట్టుగా తల ఊపాడు గెలెన్. "ఇప్పటి వరకూ ఈ విషయం ఎవరికీ తెలియదు. తూర్పు జర్మనీలోని మన గూఢచారులందరి ఆనుపానుల్ని కనుక్కున్న వుల్ఫ్‌బర్ కూడా ఆమె రహస్యాన్ని పసిగట్టలేకపోయాడు. అక్కడి మన గూఢచారులందరూ అరెస్టు కావడంతో ఆమె సేకరించిన ఇన్ఫర్మేషన్ ఇక్కడకు చేరే మార్గం మూసుకుపోయింది. ఇప్పుడు నువ్వు వెళ్లి ఆమెను కలునుకోవాలి. ఆమె అందించిన సమాచారాన్నంతటినీ ఎవరికీ అనుమానం రాని విధంగా ఇక్కడకు చేరవేయాలి."

అలాగే అన్నట్టుగా తల ఊపాడు హెర్రే.

★ ★ ★

ప్రధాని ఒట్టో గ్రోట్‌వాల్ డిక్టేట్ చేస్తున్న ఉత్తరాన్ని గబగబా షార్ట్‌హాండ్ పాడ్‌లో రాసుకుంది ఎల్లీ బార్క్‌జాటీస్. ఆ తరువాత అయిదు నిమిషాల్లో దాన్ని టైప్ చేసుకుని వచ్చి అతని ముందుంచింది.

కనీసం అందులో ఏమైనా తప్పులున్నాయో పరిశీలించడం కోసమైనా దానివైపు చూడలేదతను. 'ప్రతి రోజూ చూస్తున్నా నీ చురుకుదనానికి ఎప్పటికీ నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది. ఇంత వేగంగా పనులు చేసిపెట్టే సెక్రటరీ దొరకడం నా అదృష్టం' అన్నాడు ఆమెవైపు చూసి నవ్వుతూ.

అతని పొగడ్తకు ఆమె మొహమాటంగా నవ్వి "థాంక్యూ సార్" అంది కాస్త సిగ్గుగా.

అతను మరోసారి నవ్వి తిరిగి తన ముందున్న ఫైల్లోకి తల దూర్చాడు.

అరగంట తరువాత మరేదో కార్యక్రమానికి హాజరవడం కోసం అతను వెళ్లిపోయేవరకూ తన సీట్లోనే కూర్చుని సీరియస్‌గా పనిచేసుకుందామె. ఆ తరువాత మెల్లగా లేచి చాలా మామూలుగా ఏదో పని ఉన్నట్టు ప్రధాని పర్సనల్ గదిలోకి వెళ్లింది. ప్రధాని గ్రోట్‌వాల్ అప్పటివరకూ చూసిన ఫైలు అలాగే టేబుల్ పైనే ఉంది. ఒకసారి తలుపువైపు చూసి ఎవరూ రావడంలేదని నిశ్చయించుకుని గబుక్కున ఆ ఫైలును తీసుకుని తన సీటు వద్దకు వెళ్లిపోయిందామె. జాగ్రత్తగా ఆ ఫైలును తిరిగేస్తూ అందులోని ముఖ్యమయిన డాక్యుమెంట్ల నన్నింటినీ గుర్తుపెట్టుకుని, ఆ తరువాత వాటన్నింటినీ కాపీ చేసుకుని ఫైలుని తీసుకెళ్లి యథాతథంగా ప్రధాని టేబుల్ పైన పెట్టేసింది.

ఆ రోజు ఆఫీస్ టైం పూర్తికాగానే తిన్నగా తన అపార్ట్‌మెంట్‌కి వెళ్లిపోయింది ఆమె. ఎక్కడా మరొకరికి అనుమానం కలిగే విధంగా ప్రవర్తించకుండా జాగ్రత్తలు తీసుకుంది. ప్రధాని పర్సనల్ సెక్రటరీగా ముందు జాగ్రత్త కోసం తనపైన ఎప్పటికీ ఇంటలిజెన్స్ నిఘా ఉంటుందన్న విషయం ఆమెకు తెలుసు. స్నానం చేసి ఫ్రెష్‌గా తయారయ్యి దగ్గరలో ఉన్న నైట్‌క్లబ్బుకు వెళ్లిందామె. కొద్దిసేపు అక్కడే గడిపి ఆ తరువాత బెర్లిన్‌వాల్‌కి దగ్గరలో ఉన్న చిన్న రెస్టారెంట్‌కి చేరుకుంది. తను సేకరించిన సమాచారాన్నంతటినీ కల్నల్ హెర్రేకు అందజేయాల్సిందిగా అప్పటికే ఆమెకు గెలెన్ వద్ద నుండి వర్తమానం వచ్చింది. వాటిని ఎలా అందించాలో కూడా వివరించాడతను. ఆ ఆదేశాల ప్రకారమే ఆ రెస్టారెంట్‌కి చేరుకుందామె. మామూలు కస్టమర్‌గా నటిస్తూ అదే హోటల్లో ఒక మూల కూర్చుని ఉన్న హెర్రేని కలుసుకుని తను తెచ్చిన డాక్యుమెంటు కాపీలను అతనికి అందించింది.

ఏదో లోకాభిరామాయణం మాట్లాడు కుంటున్నట్టుగా మరో అరగంటసేపు ఇద్దరూ అక్కడే కూర్చుని తరువాత చెరోవైపు వెళ్లిపోయారు.

★ ★ ★

కొన్ని నెలల తరువాత...



## నా శ్రమ తెలియాలంటే?

"మీరు కలాసి పని చేస్తూ, మీ అబ్బాయిని కలెక్టరు కావాలని కోరుకోకుండా ఆ అబ్బాయి కూడా మీలాగే కలాసియే కావాలని ఎందుకు కోరుకుంటున్నారు?" విలేకరి అడిగాడు.

"నేను రాత్రింబవళ్లూ కష్టపడే కష్టం వాటికి తెలియాలి. కలెక్టరయితే నాకష్టం ఎలా తెలుస్తుంది!"

డి. పాపయ్య (గుత్తి)

తన ఆఫీసు గదిలో కూర్చుని అంత క్రితమే అరెస్టు చేసిన పశ్చిమ జర్మనీ ఏజంటు వద్ద దొరికిన సీక్రెట్ డాక్యుమెంట్లను పరీక్షగా చూస్తున్నాడు ఎస్.ఎస్.డి. చీఫ్ ఉల్ఫ్‌బర్. ఒక్కొ డాక్యుమెంటును చూసే కొద్దీ అతని విస్మయం మరింతగా అధికం కాసాగింది. తూర్పు జర్మనీకి చెందిన చాలా కీలకమైన సీక్రెట్ డాక్యుమెంట్లు అవి. ప్రధానమంత్రి లాంటి అత్యున్నత స్థాయి వ్యక్తులకు మాత్రమే అందుబాటులో ఉండే ఆ డాక్యుమెంట్లు పశ్చిమ జర్మనీ గూఢచారుల చేతుల్లోకి ఎలా వెళ్లాయో ఎంత ఆలోచించినా అర్థం కాలేదతనికి. ఎవరికీ అనుమానం రాకుండా చాలా పెద్ద ఎత్తున గూఢచర్యం జరుగుతుందన్నది మాత్రం తెలిసిపోయింది. పశ్చిమ జర్మనీ స్పై నెట్‌వర్క్‌ను సమూలంగా తుడిచిపెట్టగలిగానని పొంగిపోయాడు తను. కానీ ఇప్పుడు స్వయంగా ప్రధానమంత్రి కార్యాలయంలోనే లీకేజీ జరుగుతోంది. అంత తేలిగ్గా డాక్యుమెంట్లు లీక్ అవుతున్నాయంటే ఆ కార్యాలయంలోనే ఎవరో పశ్చిమ జర్మనీ గూఢచారి ఉండి ఉండాలి.

ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేక పోయాడతను. వెంటనే తన ఏజంట్లలోని మెరికల్లాంటి వారిని ఎన్నుకుని వారితో ప్రధాని కార్యాలయంపైన నిఘా వేయించాడు. ప్రధాని కార్యాలయంలోని ఏ ఒక్కరినీ వదలకుండా ప్రతి ఒక్కరి కదలికలు ఎప్పటికప్పుడు రికార్డు చేయబడ్డాయి. ఈ పనులన్నీ ఎంత రహస్యంగా జరిగాయంటే కనీసం తన కార్యాలయంపైన అంత పెద్ద ఎత్తున నిఘా వేయబడిందన్న విషయం ప్రధానమంత్రి గ్రోట్‌వాల్‌కి కూడా తెలియదు..!

జరుగుతున్న లీకేజీకి కారణం ఎల్లీ బార్క్‌జాటీస్ అన్న విషయం తెలుసుకోవడానికి ఉల్ఫ్‌బర్‌కి ఎక్కువ రోజులు పట్టలేదు. సీక్రెట్ డాక్యుమెంట్లను సేకరిస్తుండగా ఆమె రెడ్‌హాండెడ్‌గా పట్టుబడింది. అన్ని రోజులూ తనకు అత్యంత నమ్మకంగా మెలిగిన ఆమె పశ్చిమ జర్మనీ ఏజంటు అన్న విషయం తెలుసుకున్న గ్రోట్‌వాల్ విస్మయంతో కదిలిపోయాడు. అప్పటికే ఆమె అతి కీలకమైన ఎంతో సమాచారాన్ని అతి నేర్పుగా పశ్చిమ జర్మనీకి చేరవేసింది.

గూఢచార రంగంలో పేరుపొందిన ఎంతో మంది గొప్ప గూఢచారిణులలాగే ఆమె జీవితం కూడా అత్యంత విషాదంగా ముగిసిపోయింది. ఆమె సాగించిన గూఢచర్యానికి ప్రతిగా తూర్పు జర్మనీ ప్రభుత్వం ఆమెకు మరణ శిక్ష విధించింది. అతి హేయమైన మరణశిక్షల్లో ఒకటైన గెలెటిన్ కత్తివేటుతో ఆమె శిరచ్ఛేదనం జరిగింది.